క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న పీడీ

పులిచెర్ల(కల్లూరు): ఐసీడీఎస్ ప్రాజెక్టు పులిచెర్ల పరిధిలోని కల్లూరు–3 అంగన్‌వాడీ కేంద్రాన్ని చిత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు వెంకటేశ్వరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ, పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వారికి బరువులు, ఎత్తులు చూసి ఎప్పటికప్పుడు వారి తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. మంచి పౌష్టికాహారం పిల్లలకు అందించి వారి ఎత్తు, బరువుకు తగ్గట్లుగా ఉండేలా చూస్తే అప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ నుంచి అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి సీడీపీఓ మల్లీశ్వరి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కార్యకర్తలు సింధు, శ్యామల, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


డీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

పలమనేరు: స్థానిక ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం డీఎం టీకే స్వామికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులు మాట్లాడుతూ తమకు నెల వేతనంగా రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని విన్నవించారు. ఇందులో సీఐటీయూ నాయకులు గిరిధర్ గుప్త, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

జంతువులను వధిస్తే కఠిన చర్యలు


మతపెద్దలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ నాగేశ్వరరావు

చౌడేపల్లె: ప్రశాంత వాతావరణం నడుమ బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలని ఎస్‌ఐ నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని మతపెద్దలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గోవధను నిషేధించామన్నారు. ఆవులు, దూడలు, ఒంటెలు వంటి జంతువులను వధించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ప్రజలు పాటించాలని చెప్పారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేద వారికి నిత్యావసర సరుకుల అందజేత


సరుకులు అందజేసిన మహమ్మదాలీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు తలారివాండ్లపల్లెకు చెందిన నిరుపేద కుటుంబాలకు కల్లూరు లయన్స్ క్లబ్ తరపున జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మదాలీ నాలుగు నెలలు సరిపడా నిత్యావసర సరుకులు శుక్రవారం ఉచితంగా అందజేశారు. చిన్న తనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన బాలరాజు, జాహ్నవి, జ్యోత్స్న వాళ్ల అమ్మమ్మ దగ్గర పెరిగారు. ఆమె కూడా కొన్నాళ్లకు కొడుకుతో కలిసి ఇతర ప్రాంతాలకు వెళ్లింది. ప్రస్తుతం కుటుంబ భారం చిన్నారి జ్యోత్స్నపై పడింది. చాలీచాలని సౌకర్యాలతో ఆ బాలిక ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తోంది. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న మహమ్మదాలీ చలించి తనవంతు సాయం అందజేశారు. తలారివాండ్ల పల్లె ఎస్సీ కాలనీలో మిగిలిన ఇద్దరు పిల్లలను కూడా జ్యోత్స్న(19)తానే అన్నీ అయి ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తోంది.

‘బాబు’ చేసిందేమీ లేదు

అభివృద్ధికి నిర్వచనంగా కుప్పాన్ని మారుస్తా..రాష్ట్రాన్ని మరో సింగపూర్ చేస్తా.. అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నిసార్లు చెప్పారో లెక్కలేదు. ఆయన మాటలకు, చేతలకు పొంతనే ఉండటం లేదు. కుప్పం నియోజకవర్గాన్ని వేలాది కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామని ఆర్భాటపు ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయి. డాంబికాలు తప్పితే ఆచరణలో శూన్యమని ఏడాది పాలనలో చెప్పకనే చెప్పారు. ఏడాది కాలంలో వంద కోట్ల రూపాయల పనులు కూడా ఇక్కడ జరగలేదంటే అతిశయోక్తి కాదు. ఇదీ సాక్షాత్తు సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ప్రజల నుంచి వినిపిస్తున్న మాట.

- కుప్పానికి వేల కోట్ల నిధులు ఎక్కడ?
- రూ.వంద కోట్లు దాటని అభివృద్ధి పనులు
- గోకులం.. కార్యకర్తలకే అందలం
- మాస్టర్ ప్లాన్‌కు ఇంకనూ ఎన్నిరోజులో..?
- ఏడాది పాలనపై పెదవి విరుస్తున్న కుప్పం ప్రజానీకం


టీడీపీ కార్యకర్తలకు కేటాయించిన గోకులం షెడ్లు

కుప్పం: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో రూ.2వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అటు అధికార పార్టీ నేతలు, ఇటు అధికారులు సైతం ప్రకటనలు ఎన్నోసార్లు చేశారు; చేస్తున్నారు కూడా. వాస్తవాలను గమనిస్తే కేవలం వంద కోట్ల రూపాయల అభివృద్ధి పనులు కూడా ఏడాది కాలంలో చేయలేదనేది నిష్ఠుర సత్యం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వేసవి సమయంలో సకాలంలో తాగు నీటి సరఫరా చేయలేదు. 30 కోట్ల రూపాయలతో అక్కడక్కడా రోడ్లకు గుంతలు పూడ్చడం మినహా కొత్తగా ఒక రోడ్డు వేసిన దాఖలాలు లేవు. ప్రజలకు హామీలతో అరచేతిలో స్వర్గం చూపడం తప్ప మరేదీ లేదని పెదవి విరుస్తున్నారు.

విస్తరణేదీ..?

ముఖ్యమంత్రి నియోజక వర్గంలో కేవలం గుంతలు పూడ్చే పనులు చేయడం తప్పితే మేజర్ పనులు ఎక్కడా చేసింది లేదు. పట్టణ నడిబొడ్డున రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని పదేళ్లుగా నేతలు ఇచ్చిన హామీ నెరవేరలేదు. నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు అధ్వానస్థితికి చేరాయి.

మాస్టర్‌ప్లాన్ పూర్తి కాకనే అభివృద్ధి అట!

కుప్పం నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు విజయవాడ, సింగపూర్ నుంచి ప్రత్యేక బృందం ఏడాదిగా కుప్పంలో పర్యటిస్తోంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు మరో ఏడాది పడుతుందని అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఏడాది గడిచినా మాస్టర్ ప్లాన్ పూర్తికాకపోవడం గమనార్హం! మరో ఏడాది మాస్టర్ ప్లాన్ పూర్తి చేసిన వెంటనే వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపడతమని కడా అధికారులు పత్రికా సమావేశంలో ప్రకటించారు. 25 మంది ప్రత్యేక బృందంతో కుప్పం అభివృద్ధిపై ఏడాదిగా ప్రణాళికలు, ప్లానింగ్ మీద చర్యలన్నీ పూర్తి కాక పేపర్లకే పరిమితమైంది.

‘గోకులం’తో కార్యకర్తలకే లబ్ధి

కుప్పంలో ప్రజల అభివృద్ధి, సంక్షేమం కన్నా ప్రాధాన్యత అంతా టీడీపీ క్రియాశీలక కార్యకర్తలకేనని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, చేపట్టిన పనులు కళ్లకు కట్టినట్లు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. గోకులం షెడ్లే దీనికి నిలువెత్తు నిదర్శనం. నియోజకవర్గంలో మొదటి విడతగా క్రియాశీలక కార్యకర్తలను ఎంపిక చేసి వారికి 120 గోకులం షెడ్లు మంజూరు చేసింది. ఈ షెడ్ల కోసం మొదటి విడతగా పెద్దమొత్తంలోనే విడుదల చేశారు. రెండవ విడతగా మరో 89 పంచాయతీలకు 155 మందిని ఎంపిక చేసి షెడ్లు మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు రెండవ విడత షెడ్లు నిర్మించిన లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయలేదు. కేవలం కార్యకర్తల జేబులు నింపేందుకు నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

 
మరమ్మతులు చేసినా నెల రోజులకే అధ్వానంగా మారిన రోడ్లు


అధ్వానంగా మారిన నల్లకుంట రోడ్డు


కంకర తేలిన కుప్పం రింగ్ రోడ్డు

త్వరలో డంపింగ్ వ్యర్థాల తొలగింపు


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: పట్టణ సమీపంలోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త నిల్వలను త్వరలో శుద్ధిచేసి సమస్యను పరిష్కరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆమేరకు గొబ్బిళ్ల కోటూరు డంపింగ్ యార్డులో చేపట్టిన పనులను శుక్రవారం పరిశీలించారు. కంపోస్టు యార్డులో తడి, పొడి చెత్తల నిర్వహణపై వారికి పలు సూచనలు చేశారు. ఇందులో మున్సిపల్ డీఈ సురేష్‌బాబు, ఏఈ స్నేహలత పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

వి.కోట: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాంతి, సంతోషం సమృద్ధిని ఆ భగవంతుడు ముస్లింలకు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ప్రతిభ అవార్డుకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

పలమనేరు: ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ప్రతిభ అవార్డులకు పట్టణంలోని మధు, శ్రీవాణి విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్టు కళాశాల నిర్వాహకులు కృష్ణమూర్తి రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయా గ్రూపుల్లో టాపర్లుగా నిలచిన అల్ఫిన్, మోక్షజ్ఞ, ఫిజా అంజుమ్‌కు ఆయన అభినందనలు తెలిపారు. త్వరలో విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ప్రభుత్వం ద్వారా ఈ అవార్డులను వీరు అందుకోనున్నట్టు ఆయన తెలిపారు.

మృతులకు జెడ్పీ చైర్మన్ నివాళి


నాగరాజుకు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని ఓగు గ్రామానికి చెందిన రవాల్ శెట్టి శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఓగు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నాయకుని మృతికి నివాళి

మండలంలోని చింతమాకులపల్లి పంచాయతీ కుదవగడ్డ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మాజీ సచివాలయ కన్వీనర్ నాగరాజు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ కుదవగడ్డ గ్రామానికి చేరుకుని నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పూజా కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్

మండలంలోని నెల్లితిప్ప గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు శ్రీ మేలపులి గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

బాల్య వివాహాలను అరికట్టడమే ధ్యేయం


మాట్లాడుతున్న వరలక్ష్మి

వి.కోట : బాల్య వివాహాలను అరికట్టడమే ధ్యేయంగా కిశోరి వికాస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు పాపేపల్లి అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి తెలిపారు. మండలంలోని పాపేపల్లిలో శుక్రవారం కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు శారీరక వ్యాయామంపై అవగాహన కల్పించారు. మహిళా పోలీస్, సర్పంచ్, కిశోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

‘మహాప్రస్థానం’ ప్రారంభం

చిత్తూరు అర్బన్: నగరంలోని కైలాసపురం ఆవరణలో నిర్మించిన కై లాధామం మహాప్రస్థానాన్ని శుక్రవారం ప్రారంభించారు. గ్యాస్ ఆధారిత దహన క్రియలు నిర్వహించేందుకు దాతల విరాళాలతో లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సర్వీసెస్, చిత్తూరు ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు సంయుక్తంగా నిర్మించారు. ప్రారంభోత్సవానికి రాజన్న ట్రస్టు నిర్వాహకుడు గల్లా రామచంద్రానాయుడు, ఎమ్మెల్యేలు గురజాల, ఆరణి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి


వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పలమనేరు: ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని టి.వడ్డూరు సర్పంచ్ మునస్వామి సూచించారు. ఆ మేరకు ఆ పంచాయతీ పరిధిలోని రైతులకు ఆర్ఎస్‌కే ద్వారా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వేరుశెనగ విత్తనాలను పొందిన రైతులు తప్పకుండా సాగుచేయాలని సూచించారు. ఇందులో ఆర్ఎస్‌కే సిబ్బంది సింధు, రైతులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

గంగవరం: మండలంలో వేరుశనగ విత్తనాల పంపిణీ శుక్రువారం ప్రారంభమైంది. రెండు రోజులుగా రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద ఆర్ఎస్‌కే సిబ్బంది విత్తనాల నమోదు ప్రక్రియ చేపట్టగా దాదాపు 1,585 మంది రైతులు ముందుగా విత్తనాల కోసం నమోదు చేసుకున్నారు. అలా నమోదు చేసుకున్న రైతులకు ఆయా పంచాయతీల్లో వేరుశనగ బస్తాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి


అవగాహన కల్పిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఇవ్వాలని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. అమలుపై మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక రోజు శిక్షణ తరగతులను బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం విడుదల చేసిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం తయారు చేయాలన్నారు. నాణ్యమైన కూరగాయలను వినియోగించి, భోజనం తయారీలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు. తయారు చేసిన భోజనం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమరశేఖర్, ధనలక్ష్మీ, రవీంద్ర రెడ్డి, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎర్రయ్య, చెంగారెడ్డి, రవికుమార్, ఎర్రయ్య, సదాశివ రెడ్డి, యల్లప్ప, రవికుమార్ రెడ్డి సీఆర్‌పీలు కిరణ్, రాజేంద్ర, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి


మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి యాదగిరి

పలమనేరు: విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికోసం కష్టపడాలని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి యాదగిరి సూచించారు. పట్టణంలో గత 21 రోజులుగా పినాక సంస్థ ద్వారా సాగిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, వ్యక్తిత్వ వికాస తరగతుల ముగింపు కార్యక్రమం పట్టణంలోని ఓ ప్రైవేటు భవనంలో శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన యాదగిరి మాట్లాడుతూ ఏటా రాయలసీమలోని పదిచోట్ల ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా చదువుకున్నప్పటికీ ఇంటర్వ్యూల్లో ఆంగ్లభాషను సరిగా మాట్లాడలేక అందివచ్చిన అవకాశాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికోసమే తాము ఈ శిక్షణను గ్రామీణ ప్రాంతాల్లో ఏటా ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ హైకోర్టు ఏజీపీ కృష్ణమూర్తి, కేవీ రమణ, ముద్దుక్రిష్ణ, సోమశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిత్య యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం


రొంపిచెర్లలో ర్యాలీ చేస్తున్న అధికారులు, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది


మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రొంపిచెర్ల: యోగాతో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ పీడీ వేంకటేశ్వరి అన్నారు. ఆమె ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. గర్భిణులు తేలికపాటి యోగాసనాలు చేస్తే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని అన్నారు. శారీరక మానసిక పరమైన సయన్వయాన్ని సాధించడమే యోగా ప్రధాన లక్ష్యమన్నారు. యోగాసనాలు చేస్తే స్థిరంగా ఉండడం, శరీర అవయవాలు మెరుగు పడుతూ ఏకాగ్రత పెరుగుతుందన్నారు. 8ఏళ్ల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు యోగా చేయవచ్చన్నారు. విద్యార్థులకు జ్ఞాపకశక్తితో పాటు మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. అనంతరం పురవీధుల్లో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఈవోఆర్‌డీ సత్యం రెడ్డి, సీడీపీవో మల్లీశ్వరి, సూపర్‌వైజర్ శిరీషా, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్ రెడ్డి, కార్యదర్శులు శివకుమార్, శివగణేష్, హరిబాబు, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ వేంకటేశ్వరి

ఆస్పత్రిలోనే గుంతలు


ప్రభుత్వాస్పత్రిలో గోతిలో పడిన ఆవును బయటకు తీసిన దృశ్యం
ప్రమాదకరంగా మారిన గుంతలు

చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గర్భవతులు, బాలింతలకోసం ప్రభుత్వం బీహెచ్‌యూ (బ్లాక్ హెల్త్ యూనిట్) ద్వారా మెరుగైన సేవలందించాలనే ధ్యేయంతో సుమారు రూ.50 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు చేపట్టడానికి గోతులు తీసి వదిలేయడంతో అటువైపు మేత మేస్తూ ఓ పాడి ఆవు గోతిలో పడింది. గమనించిన స్థానికులు గోతిలో పడిన ఆవును అతికష్టం మీద బయటకు తీయాల్సి వచ్చింది.

– చౌడేపల్లె

ఫుడ్ పాయిజన్‌తో పలువురికి అస్వస్థత

యాదమరి: మండలంలోని పెరియంబాదిలో నిల్వ ఉంచిన ఆహారం భుజించి పలువునే అస్వస్థతకు గురైనట్లు వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి పెరియంబాది దళితవాడలో పర్యటించారు. ఫుడ్ పాయిజన్‌కావడంతో పలువురికి వాంతులు విరేచనాలైనట్లు వెల్లడించారు. వేసవి నేపథ్యంలో గ్రామస్తులు ఆహార నియమాలు పాటించాలని కోరారు. ప్రధానంగా చెడిపోయిన మాంసాహారం తింటే చాలా ప్రమాదమని హెచ్చరించారు. గ్రామంలో ఇలాంటి అవాంఛనీయ ఘటనకు ఫుడ్ పాయిజన్ కారణమా, మరేదైనా ఉందా తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు వివరించారు.

‘నారాయణ’పై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : నిబంధనలకు నీళ్ల వదలి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజు రూపంలో రూ.వేలు గుంజుతున్న నారాయణ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు నగరంలోని నారాయణ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు ఇస్తున్నారని మండిపడ్డారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం డీఈఓ, డీవైఈఓ, చిత్తూరు ఎంఈఓ–1 కి తెలిసినప్పటికీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.